CC-0. In Public Domain. Digitized by eGangotri

బాలలకు శ్రీ రామకృష్ణుని కథ

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri



బాలలకు

శ్రీరామకృష్ణుని కథ

ఆంగ్ల మూలం :
శ్రీ రాఘవేశానంద స్వామి

తెలుగు సేత :
శ్రీ జ్ఞానదానంద స్వామి

చిత్రములు: పద్మ వాసన్

Sri Vidya Bharathi
Book Centre,
Bharathi Street,
SRINGERI - 577 139.

శ్రీరామకృష్ణ మఠము
మైలాపూరు : : మద్రాసు-600 004

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

Published by :
© The President,
Sri Ramakrishna Math,
Mylapore, Madras 600 004.

All Rights Reserved
First Impression
I-2M 2C-1-90

ISBN 81-7120-219-9

Printed in India at
Sri Ramakrishna Math Printing Press,
Mylapore, Madras 600 004.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీ రామకృష్ణుని జీవిత కథ

1. మహావిష్ణువు క్షుదీరామునికి దర్శన మిచ్చుట

కలకత్తాకు సుమారు డెభ్భై మైళ్ళ దూరంలో రమ్యమైన పరిసరాలతో గూడిన కుగ్రామం కామార్పుకూరు. ఈ ఊళ్ళో చంద్రమణీ, క్షుదీరాములనే సద్బ్రాహ్మణ దంపతులు వసించేవారు. వాళ్ళు పేదవారు. కానీ దైవభక్తి పరాయణులు. సత్యనిష్ఠ గలవారు. ఆ వూరిలో అందరికీ వీరిమీద ఎనలేని ప్రేమ, మర్యాద వుండేవి. పేదవారైనా, భగవంతుడు తమకు ప్రసాదించిన దానితో సంతృప్తిపడి సంతోషంగా జీవయాత్ర సాగించారు. వారికి రామకుమారుడు, రామేశ్వరుడు అనే యిద్దరు కుమారులు, కాత్యాయని అనే కుమార్తె పుట్టారు. తన అరవైయవ ఏట క్షుదీరాముడు పుణ్యక్షేత్రమైన గయలో వెలసిన శ్రీ మహావిష్ణువును దర్శించి తరించడానికి తీర్థయాత్రకు బయలుదేరాడు.

గయలో ఒకనాటి రాత్రి ఆతనికి అద్భుతమైన కల వచ్చింది. గదాధరుడుగా ఆ క్షేత్రంలో పూజలందుకుంటున్న శ్రీ మహావిష్ణువు క్షుదీరామునికి కలలో కనిపించి, 'క్షుదీరాం! నీ భక్తిప్రపత్తులకు మెచ్చుకున్నాను. త్వరలో నేను నీకు బిడ్డగా జన్మిస్తాను' అన్నాడు. స్వప్నంలో విష్ణుమూర్తిని చూసి పరవశించి పోయాడు క్షుదీరాముడు. కానీ ఆతడు 'జగదీశ్వరా! నేను కడు బీదవాడను. నీ అంతటివానికి నా యిల్లు తగినది కాదు. నీకు సరిగా ఆహారం కూడా యివ్వ గలిగే స్థితిలో లేను' అని మొరపెట్టుకున్నాడు. అందుకు చిరునవ్వుతో విష్ణుమూర్తి 'నువ్వేం బాధపడకు నాయనా! నీ విచ్చిన దాంతో నేను తృప్తిపడతాను' అని ఊరడించాడు.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

2. చంద్రమణీదేవిలో దివ్యతేజస్సు ప్రవేశించుట

అదే సమయంలో కామార్పుకూరులో కూడా ఒక అద్భుతం జరిగింది. ఒకరోజు చంద్రమణి పూజకోసం శివాలయానికి వెళ్ళింది. ఆమె చేతులు జోడించి ప్రార్థన చేస్తూండగా హఠాత్తుగా శివలింగంనుండి ఒక దివ్యతేజస్సు వెలువడింది. అది క్రమంగా ఆలయాన్ని పూర్తిగా ఆవరించి ఆమె దిశగా వచ్చి, ఆమెను పూర్తిగా కమ్మేసింది. ఆమె స్పృహతప్పి పడిపోయింది. మళ్ళీ స్పృహవచ్చేసరికి తాను గర్భవతిగా వున్నట్లు గ్రహించింది. గయలో కొన్ని రోజులు ప్రశాంతంగా గడిపి ఖుదీరాముడు తన వూరికి తిరిగి వచ్చాడు. చంద్రమణి భర్తతో తనకు కలిగిన దివ్యానుభూతిని వివరించింది. అప్పుడు ఖుదీరాముడు 'నీ మాటలన్నీ నిజం. నాకు కూడా విష్ణుమూర్తి కలలో సాక్షాత్కరించాడు. మనకు బిడ్డగా జన్మిస్తానని చెప్పాడు' అన్నాడు. 1836 వ సం॥ ఫిబ్రవరి నెల 18 వ తేదీన వారికి మగబిడ్డ పుట్టాడు. కౌసల్యాదశరథులకు శ్రీరామచంద్రుడు, దేవకీ వసుదేవులకు శ్రీకృష్ణుడు జన్మించినట్లుగాయిప్పుడు శ్రీరామకృష్ణుడు చంద్రమణీ ఖుదీరాములకు జన్మించాడు. బాలు డెంతో అందంగా ముద్దులొలుకుతూ వున్నాడు. మానవులు భగవంతుని విస్మరించి తప్పుడు మార్గాల్లో పోతున్నప్పుడు వారిని ఆదుకుని సరైన మార్గం చూపించడానికి భగవంతుడు మానవరూపం దాలుస్తూ వుంటాడు. రూపు దాల్చిన ఈ భగవంతునే, భగవంతుని అవతారం అంటాము. ప్రస్తుతం మానవులను ఆదుకోవడానికి భగవంతుడు శ్రీరామకృష్ణుని రూపంలో వచ్చాడు. గయాక్షేత్రంలో తనకు గలిగిన అనుభవాన్ని పురస్కరించుకుని ఖుదీరాముడు ఆ బాలుడికి గదాధరుడని నామకరణం చేశాడు.

3. గదాధరునిపై గ్రామ ప్రజల మక్కువ

ఖుదీరాముడు గొప్ప జ్యోతిషశాస్త్రవేత్త. తన గదాధరుడు సామాన్య బాలుడు కాదనీ, గొప్ప జగద్గురువు కాబోతున్నాడనీ, తనను శిష్యులు పరివేష్టించి వుండగా ఒక దేవాలయంలో వసిస్తాడనీ త్వరలో ఊహించాడు.

...thi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

ముద్దులొలికే ఆ బాలుడు గ్రామస్థులందరి ప్రేమాదరణలకు పాత్రుడయ్యాడు. ఆ బాలుడికి పాలు కావలసి వచ్చింది. పేదలైన వాళ్ళు పాలు ఎలా యిప్పించగలరు? కానీ పాల కడలిలో శయనించే మహావిష్ణువుకు పాలకు కరువా? చంద్రమణి పిల్లవాణ్ణి కన్నదని తెలుసుకుని క్షుదీరాముని బావమరిది ఒక ఆవును పంపించాడు. ఇంకేం! ఇక పాలకు ఎలాంటి కొదువా లేదు కదా! అలాగే ఆ దివ్య శిశువు పాలన పోషణలకు ఏ వస్తువు కావలసి వచ్చినా, సమకూరి పోయేది.

4. బడిలో గదాధరుడు

తన ఐదేండ్ల ప్రాయంలో గదాధరుని బడిలో చేర్చారు. అప్పుడు ఉదయం, మధ్యాహ్నం వేళలు బడు లుండేవి. చాలా చిన్నవయసు కాబట్టి గదాధరుడు కొంత సేపు బడిలో చదువుకుని తర్వాత తోడిబాలురను తీసుకుని ఆడుకోవడానికి వెళ్లిపోయేవాడు. సహజంగానే ప్రియమైన వాడు కాబట్టి గదాధరుడు బాలురకు నాయకుడయ్యాడు. పాఠాలు చదివి చిలకలా ఒప్పచెప్పటం ఆతడికి నచ్చదు. ఎలాగో కొందరు బాలురను వెంటబెట్టుకుని ప్రక్కనున్న మామిడి తోటకు వెళ్లిపోయేవాడు. అక్కడ రామాయణం, మహాభారతాలలోని సుందర సన్నివేశాలను నాటకాలుగా వేసి, తోడి బాలురకు అందులో తగిన తర్ఫీదు ఇచ్చేవాడు.

బడికి వెళ్ళడంలో అంతగా శ్రద్ధ చూపలేదు. తల్లిదండ్రులకు గదాధరుడి జన్మరహస్యం తెలుసు కాబట్టి వారు కూడా ఉదాసీనంగా వుండిపోయారు. మట్టితో బొమ్మలుచేయడంలో, రంగులు వేయడంలో గదాధరుడు చక్కని ప్రావీణ్యం సంపాదించాడు. మట్టితో దేవీ దేవతల బొమ్మలు చేసి వాటిని భక్తితో పూజించేవాడు.

5. గదాధరుడు సాధుపుంగవులకు సపర్యలు చేయుట

తన ఏడవ యేట గదాధరుడు తండ్రిని కోల్పోయాడు. ఈ దుర్ఘటన ఆతడికి ఎంతో ఆవేదనను కలిగించింది. అంతా శూన్యంగా అతడికి కనిపించింది. ఊరిబైట ఒక చిన్న గుడిసె వుండేది. తీర్థయాత్రకు వెళ్లే సాధుపుంగవులు ఆ వూరిగుండా పయనించేటప్పుడు ఆ గుడిసెలో సేద తీర్చుకొనేవారు. అలాంటి సాధువులను దర్శించటం, వారితో సంభాషించడం, వారికి సేవచేయడమంటే గదాధరుడికి ఎనలేని ప్రీతి. సన్న్యాసులు ఎప్పుడూ ప్రశాంతంగా, ఆనందంగా వుంటారు కాబట్టి, వారివద్దకు వెళ్ళేవారికి కూడా



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

మనోప్రశాంతత అలవడుతుందని ఆతడికి తెలుసు. వారి వంటకు కావలసిన వంటచెఱకు సేకరించి తెచ్చేవాడు. వంట పనిలో వారికి సాయపడేవాడు. బాలుడి భక్తిప్రపత్తులు చూసి చంద్రమణి ఎంతో సంతోషించేది. కానీ ఒకరోజు గదాధరుడు సన్న్యాసిలా వేషం వేసుకుని 'అమ్మా! నన్ను చూడు. నేనిప్పుడు సన్న్యాసిని' అనేసరికి ఆమె హడలిపోయింది. తన బిడ్డను ఆ సాధువులు తమతోపాటు తీసుకెళ్ళిపోతారేమో నని అపోహ పడింది. ఆ సంగతి గ్రహించిన సాధువులు ఆమెతో 'అమ్మా! మరేం భయపడకండి. మే మలాంటి పను లెప్పుడూ చేయం తల్లీ!' అంటూ నచ్చచెప్పారు. తల్లి మనస్సు కుదుట పడింది.

6. గదాధరుడు విశాలాక్షి దేవాలయానికి వెళ్లటం

కామార్పుకూరు నుండి సుమారు రెండుమైళ్ళ దూరంలో ఆనూరు అనే పల్లెలో విశాలాక్షి అమ్మవారి దేవాలయం వుంది. గదాధరుడు ఒకరోజు కొందరు స్త్రీ యాత్రీకులతో కలిసి అమ్మవారి దేవాలయానికి బయలు దేరాడు. అలా నడుస్తూ గదాధరుడు భావావేశంతో అమ్మవారిపై ఉత్తేజకరమైన పాటలు పాడుతూ, తోడువారి అలసటను తొలగించాడు. ఆ సమయంలో ఆనందాశ్రువులు ఆతడి చెక్కిళ్లపై రాలాయి. ఈ పాటలు అతడి గాఢమైన భక్తిస్వభావాన్ని ఎంతగా కదిలించాయంటే ఆ సమయంలో అతనిముందు కాన్పించిన దివ్యచైతన్యంలో మునిగిపోయి

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

బాహ్యస్మృతిని కోల్పోయాడు. స్త్రీలు బాలుడి స్థితి చూసి భయపడిపోయారు. ముఖంపై నీళ్ళు చల్లారు. కానీ గదాధరుడిలో ఎలాంటి చలనమూ లేదు. తుదకు ప్రసన్నమయి అనే ఆమె విశాలాక్షి అమ్మవారు అతడిపై ఆవేశించిందని తలచింది. ఆమె గదాధరుని ఎప్పుడూ దేవుడిలా చూసేది. తుదకు ఆమె చెప్పినట్లు అందరూ విశాలాక్షి అమ్మవారి నామస్మరణ చేయసాగారు. ఏమి ఆశ్చర్యం? గదాధరుడికి వెంటనే స్పృహ వచ్చింది. ఈ దివ్యానుభూతివల్ల గదాధరుడిలో ఏ విధమైన బాహ్య అలసట, అశక్తత కలుగకపోవడంతో వారు తమ యాత్ర కొనసాగించారు. మనోహరమైన భక్తిగీతాలు పాడడంవల్ల, ఆకర్షణీయమైన అనేక ప్రజ్ఞలు కలిగి వుండడం వల్ల గదాధరుడు ఆ గ్రామస్తులందరికీ ముద్దుబిడ్డడైపోయాడు.

7. సత్య సంధత

గదాధరుడికి తొమ్మిదో యేట ఉపనయన సంస్కారాలు చెయ్యడానికి తల్లి, సోదరులు పూనుకున్నారు. కాని వారి కొక గడ్డుసమస్య ఎదురైంది. ఉపనయన సంస్కారం ముగిశాక గదాధరుడు తన మొదటి భిక్షను తల్లివద్దగానీ, తల్లికి సరిసమానులైన వారినుండి గానీ స్వీకరించాలి కాని భక్తురాలూ, గదాధరునిపట్ల అత్యంత ప్రేమబద్ధురాలు నైన



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

ధని అనే నిమ్నజాతి ముసలావిడ, ఉపనయనం తర్వాత మొదటి భిక్షను తన నుండే స్వీకరించాలని గదాధరుని వద్ద వాగ్దానం తీసుకుంది. తల్లికీ విషయం గదాధరుడు తెలిపాడు. ఇది సాంప్రదాయ విరుద్ధమని తల్లి చెప్పింది. కానీ తన వాగ్దానాన్ని ఉల్లఘించడం అసత్యదోషమౌతుందని గదాధరుడు పట్టుపట్టాడు. ఇప్పుడేం చెయ్యాలి? చంద్రమణి యితరులతో సంప్రతించింది. గదాధరుడు సత్యవ్రతుడని అందరికీ తెలుసు కాబట్టి అతణ్ణి ధని నుండి తొలిభిక్ష స్వీకరించడానికి సమ్మతించారు. ధని ధన్యురాలైంది.

8. గదాధరుడి శివపాత్రధారణం

మహాశివరాత్రి పర్వదినాన భక్తులు ఉపవాసం వుండి రాత్రంతా శివపూజ, సంకీర్తనాదులతో జాగరణ చేస్తారు. గదాధరుడు కూడా రోజంతా ఉపవాసం చేసి రాత్రి పూజకు ఆయత్తమయ్యాడు. ఆ రాత్రి ఆ వూళ్ళో శివలీలా నాటకం ప్రదర్శించబడనున్నది. కానీ ఆ నాటకంలో శివలీలా పాత్రధారికి అకసాత్తుగా జబ్బు చెయ్యడంవల్ల ప్రధాన శివపాత్రను ధరించడానికి గదాధరుడే తగినవాడని గ్రామ పెద్దలు నిర్ణయించి, గదాధరుని అంగీకరింపజేయడానికి అతడి మిత్రులను నియోగించారు. 'అదెలా సాధ్యం? నేను శివపూజ చేసుకోవాలిగా?' అన్నాడు గదాధరుడు. దానికి స్నేహితులు 'నువ్వు శివుని పాత్ర ధరించావంటే నీ మనస్సెప్పుడూ శివుడి మీదే లగ్నమై వుంటుంది' అని సమ్మతింపజేశారు. మిత్రులు గదాధరుని శివుడిలా అలంకరించారు భస్మం, జటారుద్రాక్షమాలలు. వ్యాఘ్ర చర్మం, చేతిలో త్రిశూలం ధరించాడు. అతడు ప్రశాంత గంభీరవదనంతో బాల చంద్రాదిక జటాజూటంతో రంగస్థలం ప్రవేశించేసరికి ప్రేక్షకులు అతణ్ణి రెప్పవాల్చక చూడసాగారు. అపర పరమేశ్వరుడిలా కనిపించాడు గదాధరుడు! కాని గదాధరుడిలో చలనం పూర్తిగా ఆగిపోయింది. అతడి మానసం బాహ్యప్రపంచస్మృతి నతిక్రమించి పరమేశ్వర ధ్యానంలో లగ్నమైపోయింది.

కన్నులనుండి అశ్రుధారలు ప్రవహిస్తూండగా, ముఖమండలం దివ్య తేజోవంతమై దీపించింది. మిత్రులెంత

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

ప్రయత్నించినా అతడికి బాహ్యస్మృతి కలుగనే లేదు. చివరకు నాటకం ఆగిపోయింది. గదాధరుడికి యిలాంటి భావపారవశ్య స్థితులు అప్పు డప్పుడూ కలుగసాగాయి. తాను ఏ దేవతామూర్తిని ధ్యానిస్తాడో లేక పాడుతాడో ఆ రూపం తన మనస్సులో ప్రకాశిస్తుందని గదాధరుడు తెలియ జేశాడు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

9. మారువేషధారణలో గదాధరుడి ప్రావీణ్యం

గదాధరుడు ఎన్నో ఛలోక్తులతో గ్రామ ప్రజలను సంతోషపరిచేవాడు. ఖుదీరాముడి యింటి పొరుగున దుర్గాదాసనే జమీందారు వుండేవాడు ఆతడు తన ఇంటి స్త్రీలను గూర్చి డంబాలు పలుకుతూ వారు అసూర్యంపశ్యలనీ, వారి అంతఃపుర నివాసం గూర్చి అన్యు లెవరికీ ఎంతమాత్రం తెలియదనీ చెప్పేవాడు. గదాధరుడు ఒకరోజు అతడి డంభోక్తులు విని 'అయ్యా, స్త్రీలను అంతఃపురంలో వుంచడం వారి పాతివ్రత్యాన్ని కాపాడే మార్గంకాదు, అందుకు సద్విద్య, భగవద్భక్తి - యివే సాధన మార్గాలు' అన్నాడు. అంతేకాదు 'మీ అంతఃపురంలో నేను అవలీలగా ప్రవేశించగలను' అన్నాడు. అందుకు దుర్గాదాసు 'అది నీ తరంకాదు, ఏదీ చేసి చూపించు' అన్నాడు. 'సరే చూద్దాంలే' అంటూ గదాధరుడు చిరునవ్వుతో వెళ్ళిపోయాడు.

ఒకనాడు సాయంకాలం దుర్గాదాసు కొందరు మిత్రులతో సల్లాపాలాడుతూ వుంటే ఒక పేదరాలు చంకలో ఒక పుటికతో, మేలిముసుగుతో అక్కడికొచ్చి 'అయ్యా! నేను పొరుగూరి సాలెదాన్ని. నూలు అమ్ముకోవడానికి సంతకొచ్చాను. తోడివారందరూ వెళ్లిపోయారు. ఇప్పటికే చీకటి పడింది. అందువల్ల యీ రాత్రి మీ యింటి ఆడవాళ్ళతో వుండనివ్వండి' అని అభ్యర్థించింది. దుర్గాదాసు ఆమెను కొన్ని ప్రశ్నలడిగి, తర్వాత యింట్లోకి పంపించాడు. ఆమె యింట్లో కెళ్ళి, యింటి స్త్రీలతో భక్తిపరవశంతో గానంచేసి వారి నందరిని ఆనందపరిచింది. ఇలా ఒక జాము గడిచింది. గదాధరుడు యింతవరకూ ఇంటికి తిరిగిరానందున ఆందోళనతో చంద్రమణి, కుమారుడు రామేశ్వరుని పంపింది. రామేశ్వరుడు అతడికోసం వెదుకుతూ 'గదాయ్, గదాయ్' అని పెద్దగా పిలుస్తూ అటువైపు వచ్చేసరికి దుర్గాదాసు ఇంట్లో నుండి 'అన్నా! ఇదుగో వస్తున్నాను' అంటూ అరుపు వచ్చింది. సాలెపడుచు పరిగెత్తుకుంటూ వెళ్ళింది. సాలెపడుచు వేషంలో వచ్చింది గదాధరుడే అని దుర్గాదాసు గ్రహించి, ఆశ్చర్యపోయాడు. మొదట్లో కాస్త



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

కోపించినా, చివరకు అతడి మహా చమత్కారానికి సంతోషించి, తమ స్త్రీలను అతడితో సంప్రదించడానికి అడ్డు చెప్పక గదాధరుడి భక్తిపాటలను వినడానికి అనుమతించాడు.

10. కామార్పుకూరు వదలి వెళ్లటం

గదాధరుడు పదిహేడేండ్ల ప్రాయం వాడయ్యాడు. కానీ చదువులో ఆసక్తి చూపడం లేదు. అన్న రామకుమారుడు కలకత్తాలో ఒక సంస్కృత పాఠశాల ప్రారంభించి యిలా అనుకున్నాడు. 'నేను గదాధరుని యిక్కడికెందుకు తీసుకురాకూడదు? నాకు చేదోడు వాదోడుగా వుంటూ హాయిగా చదువుకోవచ్చు కూడా!' గదాయ్ కూడా దీనికి సరేనన్నాడు. కానీ తాను పుట్టి పెరిగిన వూరు వదిలిపెట్టడం కష్టంగా అనిపించింది గదాయ్‌కి! ఊరి జనానికి కూడా యీ విషయం చాలా బాధ కలిగించింది. తమ ప్రియ గదాయి తమను విడిచి పట్టణం వెళ్ళిపోతున్నాడు. కానీ కలకత్తాకు వెళ్ళిన తర్వాత కూడా రామకుమారుడు గదాయ్‌లో చదువు పట్ల ఆసక్తి కలిగించలేకపోయాడు. ఒకనాడు తమ్ముడితో 'గదాయ్! నువ్వు పెరుగుతున్న కుర్రవాడివి. కానీ చదువులో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదే?' అని ప్రశ్నిస్తే, వెంటనే 'అన్నయ్యా! ఈ పొట్టకూటి చదువులతో నాకు పనిలేదు. భగవత్సాక్షాత్కారానికి పనికివచ్చే విద్య నేర్చుకుంటాను' అని జవాబిచ్చాడు గదాయి. రామకుమారుడికి ఈ సమాధానం ఆశ్చర్యం కలిగించినా గదాధరుడు గొప్ప మహనీయ వ్యక్తి కాగలడని ఎరిగి అతడిని అతడి దారిన వదిలేశాడు.

11. దక్షిణేశ్వర కాళికాలయంలో శ్రీరామకృష్ణుడు

గదాధరుడు కలకత్తాలో తన అన్నయ్యతో మూడేండ్లు గడిపాడు. కలకత్తాకు ఉత్తరాన నాలుగుమైళ్ళ దూరంలో అత్యంత మనోహర పరిసరాలతో కూడిన పేట దక్షిణేశ్వరం. ఇది పవిత్ర గంగాతీరంలో వుంది. ఇక్కడ నెలకొన్న కాళికాలయంలో రామకుమారుడు అర్చకుడుగా నియమించబడ్డాడు. అచ్చట పన్నెండు శివాలయాలు, రాధాగోవిందాలయం భక్తుల నాకర్షిస్తున్నది. ఆలయాన్నానుకుని పెద్ద తోట వుంది. అందు వనశోభను పెంపొందిస్తూ అనేక మహావృక్షా లున్నాయి. కొన్ని రోజుల తర్వాత గదాధరుడు కూడా తన నివాసం అక్కడ ఏర్పాటు చేసుకొన్నాడు. గదాధరుడు యిప్పటినుంచీ శ్రీరామకృష్ణుడుగా పిలువబడ్డాడు. రాణి రాసమణి అనే భక్తురాలు ఈ దేవాలయాన్ని కట్టించింది. ఆమె తన అల్లుడైన మధురనాథునితో అప్పుడప్పుడు దేవాలయానికి వచ్చి వెళ్లేది. శ్రీరామకృష్ణుడు వీరిద్దరి



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

దృష్టినీ ఆకర్షించాడు. కాళికాలయంలో అర్చక పదవి స్వీకరించడానికి రామకృష్ణుని వీరిద్దరూ ఒప్పించారు. అన్న రామకుమారునికి పూజాకృత్యములలో సహాయపడటమే కాకుండా కాళీమాత దివ్య విగ్రహానికి వస్త్రాలంకరణాదులు చేయడానికి కూడా రామకృష్ణుడు పూనుకున్నాడు. శ్రీరామకృష్ణుడు యీ పని చాలా భక్తిప్రపత్తులతో చేస్తూ వచ్చాడు.

12. రాధాకాంతుని విగ్రహం

దక్షిణేశ్వరంలోని శివాలయాలకు, రాధాకాంతుని ఆలయానికి ప్రత్యేకంగా అర్చకులు నియమింపబడ్డారు. ఒకసారి రాధాకాంతుని ఆలయంలో ఒక ప్రమాదం జరిగింది. రాధాకాంతుడి విగ్రహాన్ని తీసుకెళుతున్న అర్చకుడు జాలుజారి క్రిందపడ్డాడు. ఆ పడటంలో విగ్రహమూ క్రిందపడి, దాని కాలు విరిగిపోయింది. విరిగిపోయిన విగ్రహం పూజకు పనికిరాదు కదా! ఇప్పుడేం చెయ్యాలి? రాణీ రాసమణి పండితుల సభను ఏర్పాటుచేసి, వారి సలహా కోరింది. వారంతా ఏకగ్రీవంగా 'విరిగిన ప్రతిమ పూజకు పనికిరాదు కాబట్టి దాన్ని గంగలో పడేసి క్రొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠ చెయ్యాలి' అన్నారు. కానీ రాణీ రాసమణిని ఆ విగ్రహం ఎంతగానో ఆకట్టుకుంది. ఆమె అశ్రుపూరితురాలైంది. ఆమె శ్రీరామకృష్ణుడి సలహా తీసుకోడానికి ఆయనకు కబురు చేసింది. అప్పుడు శ్రీరామకృష్ణుడు దివ్య పారవశ్యంతో 'ఏమిటీ! భగవంతుడి విగ్రహాన్ని పారవేయడమా? ఎంత తెలివిమాలిన పని! రాణీగారి అల్లుడికి కాలు విరిగిపోతే ఆమె ఏం చేస్తుంది? ఆమె అతణ్ణి నిరాకరించి, మరొకని అల్లుడుగా చేసుకుంటుందా లేక మంచి వైద్యుడితో అతడి కాలు బాగు చేయిస్తుందా? సరిగ్గా విగ్రహం పట్ల చెయ్యాల్సింది కూడా యిదే! విగ్రహం కాలును అతికించి పూజకు వుంచవలసిందే కదా!' అన్నాడు. ఈ సలహా అందరికీ కను విప్పు కలిగించింది. విగ్రహం కేవలం రాయియో, లోహ ఖండమో కాదు. అందులో భగవంతుడే అంతర్యామిగా వుంటున్నాడు. సర్వవ్యాపకుడైన భగవంతుణ్ణి మనం విగ్రహం ద్వారా కొలుస్తాము, ఆరాధిస్తాము. విరిగిపోయిన ఆ విగ్రహాన్ని శ్రీరామకృష్ణుడే తన అద్భుత కౌశలంతో చక్కగా అతికించగా రాణీ రాసమణి ఆ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠింప చేసింది.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

13. శ్రీరామకృష్ణునికి కాళీమాత సాక్షాత్కారం

శ్రీరామకృష్ణుడు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆరాధనతో కాళీమాతను పూజిస్తూ వచ్చాడు. ప్రస్తుతం ఆతడి హృదయాన్ని తపింపచేస్తున్న ధ్యేయం యిదే - తాను పూజిస్తున్న కాళీమాతను ప్రత్యక్షంగా దర్శించటం! కాళీమాత తాను పూజిస్తున్న విగ్రహంలో విరాజిల్లుతూ తన పూజను స్వీకరిస్తోందని ఆతడు భావించినా, యిలాంటి భావనలో ఆతడి హృదయం తృప్తిచెందలేదు. కాళికామాతను దేవతా మూర్తిగా మాత్రమే కాకుండా ఒక బిడ్డకు తల్లిలా లాలించే మాతృమూర్తిగా, ఆదుకునే తల్లిలా ప్రత్యక్షంగా ఆమెతో చనువుగా మాట్లాడాలి, సల్లాపాలు చెయ్యాలి, ఆడుకోవాలి- ఇలాంటి కాళీమాతను సాక్షాత్కరించుకోవాలనే శ్రీరామకృష్ణుడు రేయింబవళ్ళు ఆమెను ఆర్తితో ప్రార్థించసాగాడు.

వనంలో వున్న వటవృక్షం క్రింద కూర్చుని ఆమె దర్శనంకోసం రాత్రంతా విలపించేవాడు. నిద్రాహారాలు మాని వేళాడు రేయింబవళ్ళు ఏకధాటిగా కాళీమాత ధ్యానం చేస్తూ 'అమ్మా! అమ్మా! నాకు నీ దర్శన భాగ్యం కలిగించమ్మా! నన్ను ఆదుకో తల్లీ' అంటూ ఆర్ద్రింతో ప్రార్థించేవాడు. ఇలా రోజులు గడిచాయి. ఒక రోజు అమ్మ విగ్రహం ముందు నిలబడి 'అమ్మా! నీ అస్తిత్వం సత్యమైన పక్షంలో నువ్వు నా కెందుకు దర్శన మివ్వవు? నాకు యీ ప్రపంచంలో కావల్సింది ఏదీ లేదు. ధనం, కీర్తి, సుఖభోగాలు యివేవీ అవసరంలేదు. నీ సాక్షాత్కారం మాత్రమే నేను కోరేది' అంటూ బిగ్గరగా విలపించాడు. కాళీమాతను దర్శించే తీరా లన్న తపన ఆతడిలో రోజు రోజుకూ తీవ్రం కాజొచ్చింది. ప్రతి సాయంత్రం గంగాతీరానికి వెళ్ళి మట్టిలో పొర్లుతూ 'అమ్మా! మరో దినం గడిచిపోయింది. నీ దర్శనం నా కింకా లభించలేదు' అంటూ విలపించేవాడు.

ఒకనాడు కాళికాలయంలో యిలాగే ప్రార్థిస్తూ వున్నాడు - అప్పుడు ఆతడి మనసులో తాను నిజంగా జగన్మాతను దర్శించగలనా? అనే సంశయం రేకెత్తింది. అలా జగన్మాతను దర్శించజాలని పక్షంలో యీ జీవితమే వ్యర్థం.

CC-O. In Public Domain. Digitized by eGangotri

ఇక జీవించి లాభం లేదు. ఇలా తీర్మానించి జగన్మాత విగ్రహం ప్రక్కన వ్రేలాడుతున్న ఖడ్గాన్ని తీసి శిరశ్ఛేదం గావించుకోబోయాడు. మరుక్షణం కాళికాదేవి సాక్షాత్కరించింది. గర్భగుడి అంతా ఆమె దివ్యతేజంతో మిరమిట్లు గొలుపుతోంది. జగన్మాత తన అనంగు పుత్రుని చేరదీసి లాలించింది. అమిత తేజోవంతమైన ఆ ప్రకాశం శ్రీరామకృష్ణుని మైమరపించింది. ఆతడి మనస్సు ఆనందాంబుధిలో లీనమైపోయింది. ఈ దివ్యానుభవం ఆతణ్ణి దివ్యపురుషునిగా మార్చేసింది.

14. శ్రీరామకృష్ణుడు కాళికామాతతో ఆడుకోవడం

తన తల్లిని విడిచి బిడ్డ వుండగలడా? జగన్మాత ఆతనికి సాక్షాత్కరించి మళ్ళీ అంతర్ధానమైంది. కానీ రామకృష్ణుడు తన పట్టు విడిస్తేగా? మళ్ళీ మళ్ళీ ఆర్తితో తల్లిని ప్రార్థించసాగాడు. చివరికి జగన్మాత తన ముద్దు బిడ్డ ఆర్తితో పిలిచినపుడు రాక తప్పలేదు. ఎప్పుడెప్పుడైతే శ్రీరామకృష్ణుడు అమ్మను చూసితీరాలని ఆదుర్దాపడ్డాడో అప్పుడల్లా జగన్మత అతడికి దర్శన మిచ్చేది. ఈ దివ్యానుభవాలను గూర్చి కాలాంతరంలో ఆయన యిలా అన్నారు: 'నేను అమ్మ దర్శనానికి తహతహపడి విలపించినప్పుడల్లా

CC-0. In Public Domain. Digitized by eGangotri

జగన్మాత నాకు దర్శన మిచ్చేది. ఆమె చిరునవ్వుతో నాతో మాట్లాడుతూ, నాకు ఎన్నో విషయాలు నేర్పించింది.' జగన్మాత తన ప్రియ పుత్రుడితోపాటు అన్ని చోట్లకు వెళ్ళేది. ఆతడు పువ్వులు కోయడానికి వెళితే, కాలి గజ్జెలు ఘల్లుఘల్లు మన పరిగెత్తుకుంటూ ఆతణ్ణి అనుసరించేది. ఆతడు అమ్మకు తినిపిస్తే, అమ్మ అతడికి తినిపించేది. శ్రీరామకృష్ణుడు జగన్మాతతో సంభాషించటం, ఆమెకు వస్త్రాలు ధరింప చేయటం, ఆభరణాలు అలంకరింప చేయటం చేసేవాడు. జగన్మాత అతనికి మాత్రమే కనబడేది. అందువల్ల ఈతడి విపరీత కృత్యాలు చూసినవారు యితణ్ణి పిచ్చివాడి క్రింద జమకట్టారు. కానీ శ్రీరామకృష్ణుడు లోకులను గూర్చి పట్టించుకోలేదు.

15. శ్రీరామకృష్ణుడు రాసమణిని లెంపకాయ కొట్టటం

శ్రీరామకృష్ణుడి విచిత్ర పూజావిధానం దేవాలయ కార్యకర్తలకు అవగాహన కాలేదు. వారంతా మధుర నాథుని వద్ద కెళ్ళి శ్రీరామకృష్ణుడు ఆగమ విధిగా పూజ చెయ్యడం లేదని ఫిర్యాదు చేశారు. మధురనాథుడు రహస్యంగా దక్షిణేశ్వరం వచ్చి అతడి పూజాపద్ధతిని స్వయంగా గమనించాడు. శ్రీరామకృష్ణుడికి జగన్మాతపట్ల వుంటున్న అత్యంత ఆప్తతను చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు. భగవంతునిపట్ల యిలాంటి ఆప్తతను సాధించడానికే కదా పూజాపద్ధతిలో అనేక నియమాలు, నిబంధనలు ప్రవేశపెట్టబడ్డాయి. ఇలాంటి ఆప్తత ప్రాప్తమై భగవంతుడు ఆ విగ్ర

Sri Vidyabharathi Book Centre, Sringeri.

CC-O. In Public Domain. Digitized by eGangotri

హంలో ఆవిర్భవించిన పిమ్మట మంత్రోచ్చారణ నియమానుసారం జరిగినా, అది ఉల్లంఘింపబడినా, యితర నిబంధనలు పాటింపబడకపోయినా, అది నిందనీయం కాదు కదా! ఈ విషయం గ్రహించిన మధురుడు శ్రీరామకృష్ణుడి పూజావిధానానికి ఎవరూ అడ్డుపడరాదని తీవ్రంగా మందలించి వెళ్ళిపోయాడు.

ఒకరోజు రాణీ రాసమణి కాళికాలయానికి వచ్చింది. పూజ ముగిశాక జగన్మాతమీద రెండు కీర్తనలు పాడమని శ్రీరామకృష్ణుని అడిగింది. అతడు కూడా తన సుశ్రావ్య కంఠంతో జగన్మాతను గూర్చి పాడసాగాడు. పాట మధ్యలో ఆమెను చూస్తూ, ఆమె మనస్సు పాటమీదకాక ఎక్కడో వుందని గ్రహించాడు. గాజుతో మూయబడివున్న వస్తువులను మనం స్పష్టంగా చూడగలిగేట్లు, ఆతడు ఇతరుల మనస్సులలో తొంగిచూడగలడు. ఆతడు కోపంతో ఆమె చెంపమీద ఫెళ్ళుమని కొట్టాడు. అందరూ ఆ చర్యకు దిగ్భ్రాంతులయ్యారు. కొందరు కోపంతో 'ఈ అర్చకునికి ఎంత ధైర్యం! రాణినే కొడతాడా! అతణ్ణి పట్టుకొని దండించండి' అంటూ అరవసాగారు.

కానీ రాణి రాసమణి మాత్రం ప్రశాంతంగానే వుండి, అర్చకుని ఎవరూ తాకరాదని గట్టిగా శాసించింది. ఆమె తన గదిలోకి వెళ్ళి ఆలోచించింది. 'నేను భక్తి కీర్తనలు శ్రవణానందంగా వినడానికి బదులు న్యాయస్థానంలో జరుగుతున్న వ్యాజ్యం గూర్చి ఆలోచిస్తూ వుండిపోయాను గదా! శ్రీరామకృష్ణుడు నన్ను శిక్షించి నాకు ఉన్నత మార్గం చూపించాడు' అంటూ ఆమె అతణ్ణి ఎంతో మెచ్చుకుంది.

16. సీతాదేవి దర్శనం

శ్రీరామకృష్ణుడు కాళీమాత దర్శనంతో మాత్రం తృప్తిపడలేదు. దేవు డొక్కడే అయినా భక్తుల అభిలాషార్థం రాముడు, కృష్ణుడు, శివుడు, సీత, రాధ, జగన్మాతా యిలా పలురూపాలు ధరిస్తాడని ఆతడికి తెలుసు. తన బాల్యంలో పూజించిన శ్రీరాముని జ్ఞప్తికి తెచ్చుకుని రేయింబవళ్ళు శ్రీరాముని తారకనామం జపించసాగాడు. ఒకరోజు ఒక వృక్షం క్రింద కూర్చుని యిలా జపిస్తున్నప్పుడు నిరుపమాన తేజోమయమైన ఓ స్త్రీ మూర్తి దూరం నుండి తనవైపుగా రావడం గమనించాడు. ఆమె ఎవరాని ఆశ్చర్యపోయి చూస్తూ వున్నప్పుడే ఒక మర్కటం వృక్షం నుండి దూకి ఆమె పాదాలపై వ్రాలింది. వచ్చింది సీతామాత అని తక్షణం గ్రహించాడు శ్రీరామకృష్ణుడు. ఆమెకు మళ్ళీ మళ్ళీ ప్రణతు లర్పిస్తూ వుంటే ఆమె ఆతడిలో లీనమైపోయింది. ఆమె తన చిరు దరహాసాన్ని

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీరామకృష్ణునకు ప్రసాదించింది. ఆ దివ్య సుందర చిరు మందహాసం ఆతడి జీవితంలో ఎడబాయని అంశమైంది.

17. వివాహం

శ్రీరామకృష్ణుడి బాహ్యప్రపంచ వ్యవహారాలు చాలా విచిత్రంగా వున్నాయి. అందుచే ఆతణ్ణి పిచ్చివాడన సాగారు. ఈ విషయం తల్లి చంద్రమణీదేవి చెవిన పడింది. వెంటనే ఆమె కుమారుని కామార్పుకూరుకు పిలిపించింది. అతడు కూడా తల్లి మాటను జవదాటక స్వగ్రామానికి వచ్చేశాడు. అతడి పిచ్చిని కుదర్చడానికి వివాహమే చక్కటి ఔషధమని ఆమె భావించింది.

శ్రీరామకృష్ణుడు తన పెళ్ళికి ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవడమే కాకుండా, తనకు కాబోయే భార్య ప్రక్కవూరైన జయరాంబాటిలో వుంటోందని సూచించాడు. ఐదేండ్ల ప్రాయంలో వున్న శారదామణికి శ్రీరామకృష్ణుడితో వివాహం జరిగింది. అందరూ సంతోషించారు. తన వివాహానంతరం సుమారు ఒకటిన్నర సం॥ కాలం శ్రీరామకృష్ణుడు కామార్పుకూరులో గడిపి తర్వాత దక్షిణేశ్వరం వచ్చాడు.

18. భైరవి బ్రాహ్మణి ఆగమనం

కామార్పుకూరు నుండి తిరిగి రాగానే మళ్ళీ తీవ్ర సాధనలలో మునిగిపోయాడు రామకృష్ణుడు. పరమేశ్వరుడే పంపినట్లు ఎందరోమంది గురువరేణ్యులు విభిన్న ఆధ్యాత్మిక మార్గాల్లో ఆతడికి తగిన శిక్షణ నివ్వడానికి రాసాగారు. అలా మొట్టమొదట వచ్చింది, తాంత్రిక సాధనలలో ఆరితేరిన భైరవి బ్రాహ్మణి. నడివయస్కురాలైన ఆమె చేత త్రిశూలం ధరించి వుంది. కాషాయ వస్త్రాలు ధరించిన ఆమె శ్రీరామకృష్ణుని చూసి 'నీ కోసం ఎంతకాలం వెదికాను? తాంత్రిక సాధనలలో నీకు సహకరించడానికి జగన్మాత ఆదేశానుసారం నీ వద్దకొచ్చాను' అంది. శ్రీరామకృష్ణుని తన కన్నబిడ్డలా పరిగణించిందామె.

భగవంతుని జగన్మాతగా భావించి, అందుకోసం చేసే సాధనలను తాంత్రిక సాధనలంటారు. కాళీ, సరస్వతి, దుర్గ, లక్ష్మి యిలా జగన్మాతకు పలు రూపాలు. భైరవి బ్రాహ్మణి సహకారంతో శ్రీరామకృష్ణుడు అత్యంత కష్టసాధ్యాలైన అరవైనాలుగు తాంత్రికసాధనలను అవలీలగా ఆచరించి, విజయోపేతుడయ్యాడు. అన్ని రూపాలలో వెలుగొందుచున్న జగన్మాతను దర్శించాడు. శ్రీరామకృష్ణుడిలో నెలకొన్న అత్యద్భుత లక్షణాలు గమనించి ఆశ్చర్యచకితయైన భైరవి బ్రాహ్మణి, ఆతడు సామాన్య మానవుడు కాడని, సాక్షాత్తు భగవంతుడి అవతారమని శాస్త్ర ప్రమాణాలతో ఋజువుచేసి చూపించింది.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

19. జటాధారి ఆగమనం

వైష్ణవుల మార్గాన్ని అనుసరించి చూడాలనుకున్నాడు శ్రీరామకృష్ణుడు. భగవంతుణ్ణి శ్రీరాముడుగాను, శ్రీకృష్ణుడిగాను వైష్ణవ సంప్రదాయులు పూజిస్తారు అప్పుడు జటాధారి అనే సాధువు అక్కడికొచ్చాడు. పొడుగాటి జడలతో ఆతడు వయస్సు మళ్ళినవాడిలా కనిపించాడు. ఆతడిది వాత్సల్య భావం. శ్రీరామచంద్రుని తన కుమారుడుగా భావించి సాధనచేస్తూ వచ్చాడు. ఆతడి వద్ద బాల రాముని చిన్న లోహపు విగ్రహం వున్నది. దాన్ని రామలాలా అని పిలిచేవాడు. ఆ విగ్రహాన్ని అత్యంత వాత్సల్యాభిమానంతో చూసుకునేవాడు. దానికి స్నానం చేయించి వస్త్రాలు ధరింపచేసి, ఆహార మొసగేవాడు. పరులకు విగ్రహంగా కనిపించే ఆ రామలాల ఆ యతివరేణ్యుడికి సాక్షాత్తు బాల రాముడిగా కనిపించేవాడు. ఆ సాధువు తనకిచ్చినదాన్ని ప్రేమతో స్వీకరించి, ఆతడితో పరమానందంగా ఆడుకునేవాడు. జటాధారి అనుసరిస్తున్న వాత్సల్య భావం శ్రీరామకృష్ణుడికి ఎంతో నచ్చింది. ఆతనికి కూడా ఆ విగ్రహ రూపంలో వున్న బాల రాముని దర్శించాలని తపన కలిగింది. ఈ సాధనను జటాధారి వద్ద శ్రీరామకృష్ణుడు నేర్చుకున్నాడు. కొంతకాలం గడిచేసరికి శ్రీరామచంద్రమూర్తి సుందర బాలుడి రూపంలో ఆ విగ్రహం ద్వారా రామకృష్ణుడికి దర్శన మివ్వసాగాడు. ఒక రోజు

CC-O. In Public Domain. Digitized by eGangotri

యథాప్రకారం జటాధారి తాను వండిన ఆహారం తీసుకుని రామలాలాకు యివ్వడాని కెళితే అక్కడ రామలాల కనిపించలేదు. అతణ్ణి వెదుక్కుంటూ వెళ్ళే సరికి, అతడు శ్రీరామకృష్ణుడితో ఆడుకుంటూ ఒక వృక్షచ్ఛాయలో కనిపించాడు. మరి కొన్ని రోజులు గడిచాక జటాధారి దక్షిణేశ్వరం వదలి వెళ్ళిపోవాలని తీర్మానించుకున్నాడు. కానీ రామలాల శ్రీరామకృష్ణుని వదలి జటాధారితోబాటు వెళ్ళడానికి సమ్మతించలేదు. చివరకు జటాధారి తన ప్రాణంతో సమానమైన రామలాల విగ్రహాన్ని రామకృష్ణుడి కిచ్చేసి దక్షిణేశ్వరం వదలి వెళ్ళిపోయాడు.

20. తోతాపురి ఆగమనం

మరి కొంతకాలం గడిచింది. ఒకరోజు ఆజానుబాహువైన తోతాపురి అనే యతివరేణ్యుడు దక్షిణేశ్వరం వచ్చాడు. ఆతడు శ్రీ శంకరాచార్యుల పారంపర్యంలో అద్వైత సిద్ధాంతం అభ్యసించి సిద్ధిపొందిన మహనీయుడు. తోతాపురిని చూసిన తక్షణం ఆతడొక మహిమాన్వితుడని గ్రహించాడు శ్రీరామకృష్ణుడు. తోతాపురి శ్రీరామకృష్ణుడితో 'నాయనా! నా వద్ద వేదాంతసాధన నేర్చుకుంటావా?' అనడిగాడు. అందుకు శ్రీరామకృష్ణుడు 'అమ్మనడిగి చెబుతా'

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

నన్నాడు. అమ్మ అంటే కన్నతల్లి కాబోలనుకున్నాడు తోతాపురి. కానీ శ్రీరామకృష్ణుడు సూచిస్తున్నది జగన్మాతను. అతడు తిన్నగా కాళికాలయంలోనికెళ్ళి జగన్మాతను ప్రశ్నిస్తే అందుకు ప్రత్యుత్తరంగా ఆమె 'అవును నాయనా! నీ కోసమే నేను తోతాపురిని యిక్కడకు రప్పించాను' అంది. తోతాపురి శ్రీరామకృష్ణునకు అద్వైత వేదాంత తత్త్వోపదేశ మొనరించి ఒక చిన్న కుటీరంలో ధ్యానంచెయ్య నియోగించి, ఆ కుటీరంలో యితరులు ప్రవేశించి అతడి తపోనిష్టకు భంగం కలిగించకూడదని ఆ గదికి తాళం వేశాడు. శ్రీరామకృష్ణుడు బాహ్య ప్రపంచ స్మృతి పూర్తిగా కోల్పోయి అఖండ సచ్చిదానంద పరబ్రహ్మంలో ఐక్యమొంది నిర్వికల్ప సమాధిలో మూడురోజులుండిపోయాడు. తాను నలభై సంవత్సరాల కఠోర సాధనానంతరం సాధించిన నిర్వికల్ప సమాధి శ్రీరామకృష్ణుడికి ఒక్కరోజులో అబ్బిన పరమాద్భుతం చూసి నివ్వెరపోయాడు తోతాపురి.

21. మథురనాథుడు శ్రీరామకృష్ణుని శివునిగాను, కాళికాదేవిగాను చూడటం

రాణి రాసమణి అల్లుడూ, ఆమెకు కుడిభుజంగాను వున్న మథురనాథుడికి శ్రీరామకృష్ణునిపై భక్తిప్రపత్తు లున్నవి గాని, ఆయన భగవదవతార మని విశ్వాసం కలుగలేదు. రాత్రింబవళ్ళు శ్రీరామకృష్ణుడు ఎవరై వుండవచ్చునని ఆలోచించసాగాడు. ఒకనాడు తన ఇంటిముంగిట తీరిగ్గా కూర్చుని వున్నాడు. అప్పుడు శ్రీరామకృష్ణుడు తన గది నానుకున్న వరండాలో అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు. మథురుడు ఆతణ్ణి చూస్తున్నాడు. హఠాత్తుగా అక్కడో అద్భుతం జరిగింది. శ్రీరామకృష్ణుడు కాళికాదేవిగా పరిణమించి వరండా వెంబడి నడుచుకుంటూ వెళ్ళడం మథురుడు చూశాడు. మళ్ళీ అటువైపునుండి యిటువైపు తిరగగానే కాళికాదేవి శివుడుగా జటాజూటాలతో నడుచుకుంటూ రావడం చూశాడు మథురుడు. ఆశ్చర్యచకితుడైన మథురుడు తను చూస్తున్నది భ్రాంతేమోనని కళ్ళు నులుముకుని చూశాడు. శ్రీరామకృష్ణుడు కాళికాదేవిగాను, శివుడుగాను కనిపిస్తున్నాడు. సందేహమే లేదు, తాను చూస్తున్నది యథార్థమే, భ్రాంతికాదు అని నిర్ధారణ చేసుకున్న మథురుడు ఒక్క పరుగులో శ్రీరామకృష్ణుని వద్ద కెళ్ళి సాగిలబడి మ్రొక్కి ఆయన పాదాలను గటిగా పట్టి

CC-O. In Public Domain. Digitized by eGangotri

కున్నాడు. శ్రీరామకృష్ణుడు మథురనాథుని ఆశ్వాసపరుస్తూ లేవనెత్తాడు. తాను గాంచిన అద్భుతాన్ని వివరించాడు. 'అంతా జగన్మాత గావిస్తున్న లీల' అన్నాడు శ్రీరామకృష్ణుడు చిరునవ్వుతో.

22. బీదలపై సానుభూతి

శ్రీరామకృష్ణుడు కొన్ని పుణ్యక్షేత్రాలను దర్శించాలని సంకల్పించాడు. అందుకు ప్రత్యేక రైలుబండిని ఏర్పాటు చేశాడు మథురుడు. వారు వారణాసి, దేవఘర్, అలహాబాదు, బృందావనాలన దర్శించారు. వ్రజభూమియైన బృందావనంలో శ్రీకృష్ణ దర్శనం, వారణాసి క్షేత్రంలో శివ దర్శనం కలిగింది శ్రీరామకృష్ణుడికి! ఈ తీర్థస్థలాలు శ్రీరామకృష్ణుని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఇలా తీర్థయాత్రకు వెళుతూ దేవఘర్‌కు సమీపంలోని ఒక పల్లెగుండా పోతుండగా అక్కడి బీదల దయనీయ స్థితి శ్రీరామకృష్ణుడి హృదయాన్ని ద్రవింపజేసింది.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

వెంటనే మధురుని పిలిచి 'నిన్ను జగన్మాత ఐశ్వర్యవంతుని చేసింది. ఈ నిరుపేద లందరికీ మంచి భోజనం పెట్టి, గుడ్డలు పంచిపెట్టడం నీ కర్తవ్యం' అన్నాడు. అప్పుడు మధురుడు 'బాబా! వీరి సంతర్పణకు చాలా డబ్బు కావాలి. ఉన్న డబ్బంతా వీరికి ఖర్చు పెడితే మనం తీర్థయాత్ర కొనసాగించలేం' అన్నాడు. కానీ శ్రీరామకృష్ణుడు తన పట్టు వదల్లేదు. 'అలాగయితే నేను తీర్థయాత్రకు రాను. ఈ బీద సాదల సేవయే భగవంతుడి పూజ. ఆ దేవాలయాల్లో కంటే భగవంతుడు వీరిలో అధికంగా భాసిస్తున్నాడు' అన్నాడు. అలా అంటూ ఆ నిరుపేదల మధ్యకెళ్ళి కూర్చుని వారితో ప్రేమగా మాట్లాడసాగాడు. ఇక మధురుడికి ఆ బీదలకు అన్న సంతర్పణ చేయక తప్పిందికాదు. కలకత్తా నుండి బేళ్ళకొద్దీ బట్టలు తెప్పించి వారికి పంచిపెట్టించాడు. ఆ తర్వాతనే శ్రీరామకృష్ణుడు ఆనందంతో తన తీర్థయాత్రను కొనసాగించాడు.

23. శ్రీరామకృష్ణుని శారదాదేవిని పూజించుట

సంవత్సరాలు గడిచాయి. పద్దెనిమిదేళ్ళ ప్రాయంలో వున్న శారదాదేవి దక్షిణేశ్వరంలో వుంటున్న భర్తను కలుసుకుని, ఆయనకు పరిచర్యలు చేయడానికి వచ్చింది. శ్రీరామకృష్ణుడు ఆమెను ప్రేమతో చూసుకుంటూ, ఆమెకు సకల విధాలైన ఆధ్యాత్మిక సాధనలు నేర్పించాడు. వారు సామాన్య మానవులలా భార్యాభర్తలుగా జీవించ లేదు. వారిద్దరూ నొకరి నొకరు భగవంతుడి ప్రతిరూపంగా



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

భావించారు. శ్రీరామకృష్ణుని దృష్టిలో ప్రతి స్త్రీ జగన్మాత స్వరూపమే. అందువల్ల తన శారదను కూడా ఆ దృష్టి తోనే చూశాడు. దానినే ఆచరణలో పెట్ట తీర్మానించాడు. ఒక రోజు ఫలహారిణీ కాళికాపూజసుదినాన ఆమెను దేవతా సనాన ఆశీనురాలిని చేసి సకలోపచారాలతో పూజించాడు. ఇలా శారదాదేవిని యిక ముందు తన కార్యాన్ని కొన సాగించడానికి అన్నివిధాల ఆయత్తపరచాడు.

24. భక్త బృందంతో శ్రీరామకృష్ణుడు

భగవంతుడే శ్రీరామకృష్ణుడుగా అవతరించాడు ఆయనకు సహకరించడానికి దేవతాపురుషులు పలువురు కూడా జన్మ స్వీకరించారు. కానీ వారందరూ ఎక్కడ? భోగలాలసుల సంభాషణలలో విసిగిపోయిన శ్రీరామకృష్ణుడు దేవాలయం పైభాగా న్నధిరోహించి కలకత్తా నగరంవైపు చూస్తూ ఎలుగెత్తి 'ఓ నా బిడ్డలారా! మీరందరూ ఎక్క



CC-O. In Public Domain. Digitized by eGangotri

దున్నారు? మీరందరూ వెంటనే రండి! భగవంతుని గూర్చి మీతో సంభాషించాలి' అని పిలువసాగాడు.

ఈ సంఘటన తర్వాత అతడి అంతరంగిక శిష్యులు ఒక్కొక్కరుగా రాసాగారు. వారితో ఆనందంగా భగవంతుని గూర్చి సంభాషిస్తూ ఆయనను పొందడానికిగల మార్గాలను వివరించాడు. 'దేవుడొక్కడేగాని పలుపేర్లతో ఆయన్ను పిలుస్తాము. చమురు లేనిదే దీపం వెలగనట్లు దేవుని వదలి మానవుడు జీవించ లేడు. భక్తి, జ్ఞానం, వివేకం, వైరాగ్యం - ప్రసాదించమని ఆర్తితో జగన్మాతను ప్రార్థించు.'

శ్రీరామకృష్ణుడు తనను గురువుగా ఎన్నడూ ప్రకటించుకోలేదు. సేవకులందరికీ సేవకుడిగా తనను భావించుకున్నాడు. కానీ ఆయన ఉపదేశాలు మానవాళి మనస్సులపై చెరగని ముద్రవేసింది. అందుకు కారణం తాను బోధించిన వాటిని తన జీవితంలో ఆచరించి చూపించడమే. మానవ జీవిత పరమలక్ష్యం భగవంతుని సాక్షాత్కారమేనని ఆయన సందేశం. ఆయన శిష్యులు రెండు తెగలకు చెందినవారు. ఒక తెగవారు వివాహం చేసుకుని గృహస్థ జీవితం గడుపుతున్నవారు. మరొక తెగవారు యువకులు. అందులో పదహారుమంది తర్వాత సన్యాసు లయ్యారు.

25. నరేంద్రనాథ్

శ్రీరామకృష్ణుని అండజేరిన యువకులలో అగ్రగణ్యుడు నరేంద్రనాథదత్త. శ్రీరామకృష్ణుడు నరేంద్రుని తన యువశిష్య వర్గానికి నాయకుడుగా ఎన్నుకున్నాడు. ఈ నరేంద్రుడే పాశ్చాత్యదేశంలో వేదాంత దుందుభిని మ్రోగించి భారతదేశ అఖండ ప్రతిభను చాటిచెప్పిన విశ్వవిఖ్యాత వివేకానందస్వామి. నరేంద్రుడు ఎందరోమంది మహామహులను కలుసుకుని 'అయ్యా! మీరు దేవుని దర్శించారా?' అని అడిగేవాడు. ఈ ప్రశ్నకు సూటిగా ఆతడికి ఎవరూ జవాబు చెప్పలేదు. కానీ అదే ప్రశ్నను శ్రీరామకృష్ణుని అడిగినప్పుడు ఆయన వెంటనే 'అవును నాయనా!

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

నిన్నిప్పుడు చూస్తున్నట్లు దేవుని చూసి వున్నాను' అన్నాడు. దాంతో ఆగక మళ్ళీ 'భగవంతుని చూడటంతోపాటు ఆయనతో సంభాషించనూవచ్చు. నేను నీకు భగవంతుని చూపించగలను' అన్నాడు ఘంటాపథంగా. ఈ సమాధానం నరేంద్రుణ్ణి ఎంతగానో ఆకట్టుకుంది. శ్రీరామకృష్ణుని తన గురువుగా స్వీకరించాడు నరేంద్రుడు. కాలక్రమంలో నరేంద్రుడు అనేక ఆధ్యాత్మిక గాధ రహస్యాలు శ్రీరామ కృష్ణుని వద్ద నేర్చుకున్నాడు. ఆరేండ్ల కాలం శ్రీరామ కృష్ణుని పాదపద్మాల చెంత కూర్చుండి నేర్చుకోవలసిం దంతా క్షుణ్ణంగా నేర్చుకున్నాడు.

క్రమంగా ఎంతోమంది జిజ్ఞాసువులు తమ ఆధ్యా త్మిక వికాసానికై శ్రీరామకృష్ణుని ఆశ్రయించారు. ఆయన కూడా శ్రమ చూడకుండా తన ఆధ్యాత్మిక సంపదను అందరికీ పంచి యిచ్చాడు. ఈ విపరీత శ్రమ పర్యవ సానంగా ఆయన కంఠంలో వ్రణం బయలుదేరింది. అది నానాటికి పెరగసాగింది. తన అంత్యకాలం సమీపించిందని శ్రీరామకృష్ణులకు తెలుసు. తను చేపట్టిన కార్యం నరేంద్రుడి మూలంగా జరగాలి. శ్రీరామకృష్ణుడు గొప్ప మహాత్ముడని నరేంద్రుడికి తెలుసు. ఆతడు సాక్షాత్తు భగ వంతుడై వుంటాడని కొన్ని సమయాల్లో అనుకునేవాడు. కాని కొంత సంశయం అతడి మనస్సులో ఒక మూలలో

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

వుంటూ వచ్చింది. ఒకరోజు శ్రీరామకృష్ణుని ప్రక్కన కూర్చుని నరేంద్రుడు యిలా చింతించసాగాడు. 'శ్రీరామ కృష్ణుడు తాను భగవంతుడి అవతారమని పేర్కొన్నాడు కదా! అది నిజమై వుంటుందా? నే నాయన మాటల్ని ఎలా విశ్వసించడం? భరింపరాని ఈ కంఠ వ్రణంతో బాధ పడుతున్న ఈయన యిప్పుడు నే నడుగకుండానే తనను భగవంతుడి అవతారంగా పేర్కొంటే నేను ఆయన్ను విశ్వసిస్తాను.'

నరేంద్రుడు యిలా అనుకున్నాడో లేదో, తక్షణం శ్రీరామకృష్ణుడు తనకున్న శక్తినంతా కూడదీసుకుని 'నరేంద్రా! నీకింకా సందేహమా? రాముడుగాను, కృష్ణుడుగాను అవతరించిన ఆతడే యిప్పుడు శ్రీరామకృష్ణుడుగా అవతరించి వున్నాడు' అన్నాడు. ఈ గొడ్డలి పెట్టుతో నరేంద్రుడి సంశయాలన్నీ శాశ్వతంగా సమసిపోయాయి.

1886 సం॥ ఆగస్టు 16 వ తేదీన శ్రీరామకృష్ణుడు కాళికాదేవి నామాన్ని మూడుమార్లు ఉచ్చరించి తన భౌతిక దేహాన్ని చాలించాడు.

నరేంద్రుడు యువ సోదర శిష్యులను సమకూర్చుకుని బారా నగరంలో ఒక మఠాన్ని ప్రారంభించాడు. శ్రీరామకృష్ణుని ఆదర్శంగా, నరేంద్రుని నాయకత్వాన యువకులు తీవ్ర ఆధ్యాత్మిక సాధనలలో లయించారు. క్రమంగా వారంతా సన్న్యాసం స్వీకరించి సర్వసంగ పరిత్యాగు లయ్యారు.

పరివ్రాజకుడుగా బయలుదేరిన వివేకానందస్వామి దేశం నలుమూలలా సంచరించాడు. తర్వాత అమెరికా మొదలైన పాశ్చాత్య దేశాలకు వెళ్ళి శ్రీరామకృష్ణుని సందేశామృతాన్ని ప్రపంచమంతటా పంచి యిచ్చాడు.

శ్రీరామకృష్ణపరమహంసకు తన కానుకగా కలకత్తాకు సమీపంలోని బేలూరులో ఒక బ్రహ్మాండమైన దేవాలయం నిర్మించడానికి ప్రణాళికను రూపొందించాడు. ఈ దివ్యధామమే నేడు శ్రీరామకృష్ణ మఠ - సేవాసంస్థలకు ప్రధాన కేంద్రమై అలరారుచున్నది.


Sri Vidyabharathi Book Centre, Sringeri

వివేకంతో కోరుకో!

CC-O. In Public Domain. Digitized by eGangotri

గుప్తా ఒక వ్యాపారి. వ్యాపార రీత్యా అనేక ప్రాంతాలు తిరిగి ఎంతో ధనం సంపాదించాడు. సుఖ జీవితాన్ని గడపసాగాడు.

ఒకమారు అతడు ఓ నిర్జన ప్రాంతంగుండా పయనించాల్సి వచ్చింది. ఆ నిర్జన ప్రాంతంలో మైళ్ళదూరంలో కూడా యిళ్ళు అరుదుగా వున్నాయి. అతడు వేకువనే బయలుదేరాడు. మధ్యాహ్నానికి చాలా దూరం పయనించి, అలసిపోయాడు. సూర్యుడు తీక్షణంగా వున్నాడు. అదృష్ట వశాత్తు అత డో మహావృక్షం వద్ద కొచ్చాడు. ఆ వృక్ష చ్ఛాయలో చల్లగా విశ్రాంతి తీసుకోసాగాడు.

'ఎంత ఎండగా వుంది! దాహం చంపుతోంది. ఓ గుక్కెడు నీళ్ళువుంటే!' యిలా అతడనుకున్న మరుక్షణమే, ఒక పాత్రనిండా మంచినీళ్ళ అతడి ముందు ప్రత్యక్ష మైనాయి. ఆశ్చర్యపోతూ ఆ నీటిని త్రాగి, దాహశాంతి తీర్చుకున్నాడు.

ఈ వృక్షం మామూలు వృక్షం కాదని అతడికి తెలీదు. కోరికలు తీర్చే కల్పవృక్ష మది. దాని నీడలోవుండి ఏం కోరుకున్నా అది తీరుస్తుంది. ఇదేమీ తెలియకుండా గుప్తా తనలో యిలా అనుకున్నాడు: 'నా దాహం తీరింది. ఆకలిగావుంది. కాస్తంత ఆహారం లభిస్తే బాగుండును.' మరుక్షణమే, గుప్తా తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. అతడిముందు అనేక పాత్రల్లో రుచులూరించే రకరకాల భక్ష్యాలు ప్రత్యక్షమైనాయి. ఆత్రంగా ప్రతి వంటకాన్ని తిన సాగాడు. ప్రతీ పదార్థం మధురంగావుంది. తృప్తిగా కడుపు నిండా ఆరగించాడు. ఆతడి ఆకలి అనుకున్న దానికంటే కూడా బాగా తీరింది.

ఎండలో ప్రయాణం, మృష్టాన్న భోజనంతో గుప్తా జోగసాగాడు. 'నాకు నిద్రముంచుకొచ్చేస్తోంది. కాని యీ కటిక నేలమీద ఎలా పడుకోను? రాళ్ళు, ముళ్ళమయంగా వుండే యీ నేల. మెత్తని పక్కవుంటే బాగుండునే' అంటూ అతడు గొణుక్కున్నాడు. వెంటనే ఓ హంసతూలికా తల్పం ఆతడిముందు ప్రత్యక్షమైంది. కాళ్ళు చాచుకుని గుప్తా ఆ తల్పం మీద సుఖంగా పడుకున్నాడు. తనేదో దేవ లోకంలో వున్నట్టు భావించాడు. తను కోరుకున్నదల్లా లభ్యమౌతోంది. ఈ వృక్షం ఏమైవుంటుందో కదా అను కుంటూ అబ్బురపడ్డాడు. 'ఈ చెట్టుక్రింద వుండి ఏమి అనుకున్నా అది జరిగిపోతోంది. ఎలా? కాని, యిప్పు డీ నిర్జన ప్రాంతంలో నేనెలా నిద్రపోగలను? నాకు తోడంటూ మైళ్ళ పర్యంతం ఎవ్వరూ లేరే! నేను ఒంటరిని. ఈ దారిలో ఓ పులి గనుక వస్తే!'

అతడి నోటినుండి యీ మాటలు వెలువడకముందే, ఎక్కణ్ణుండో ఒక పెద్దపులి గర్జిస్తూ వచ్చి, అతడిపై లంఘిం చింది. పంజాతో గుప్తాను యీడ్చికొట్టి, క్షణాల్లో అతణ్ణి ముక్కలుచేసేసి, ఆరగించింది. అంతటితో ఆతడి కోరికలు అంతమయ్యాయి.

దేవుడు కల్పవృక్షంలాంటివాడు. నిజాయితీగా మనం ఏం ప్రార్థించినా వాటిని ఆయన తీరుస్తాడు. కాబట్టి మనం ఎంతో జాగ్రత్తగా ప్రార్థించాలి. ఆయన్ని మనం తెలివి, ఆరాధనలాంటి ఉన్నత విషయాలకోసం ప్రార్థించాలి. చిల్లర విషయాలకోసం ప్రార్థిస్తే, వాటిని ఆయన అనుగ్ర హిస్తాడు. ముగింపేలేని అశాంతిని మనం కోరి తెచ్చు కుంటాము. ప్రత్యేకంగా యిది కావాలని అడక్కపోవడమే ఉన్నతమైన ప్రార్థన. నీకు కావలసింది ఆ దేవుడికే వదిలెయ్యి. ఆయనకే ఆ విషయం మనకంటే బాగాతెలుసు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

తన్ను తానెరిగిన సింహం

గోపాలుడొక గొర్రెలకాపరి. అతడికి ఒక గొర్రెల మందవుంది. ప్రతిరోజూ ఆ గొర్రెలను మేతకోసం అడవికి తోలుకెళ్ళేవాడు. ఆ గొర్రెలు మేస్తూవుంటే, గోపాలుడు నది ఒడ్డునున్న చెట్టెక్కి పిల్లనగ్రోవి ఊదుకునేవాడు.

ఒకరోజు చెట్టుమీదినుంచి నది ఒడ్డున చచ్చిపడి వున్న ఓ ఆడసింహాన్ని చూశాడు. అప్పుడే పుట్టిన సింహం పిల్ల దాని పక్కన వున్నది. గోపాలుడు చెట్టు దిగాడు. అతడికి ఏం జరిగిందో అర్థమైంది. ఆ ఆడసింహం నది ఆవలి ఒడ్డునుంచి యీ వైపుకు దూకింది. నిండుగర్భంతో వున్న ఆ సింహం, ఆ ప్రయత్నంలో పిల్లనుకన్నది. కాని ఆ సంఘటనలో దాని ప్రాణం పోయింది. ఆ సింహంపిల్ల అనాథయ్యింది. అది చాలా అందంగావుంది. గోపాలుడు సింహంపిల్లను యింటికి తీసుకెళ్ళాడు. దానికి గొర్రెపాలు పట్టాడు. గొర్రెల కొట్టంలోనే సింహంపిల్లనూ వుంచాడు. అలా ఆ సింహంపిల్ల గొర్రెల మధ్య పెరగసాగింది. గొర్రెలతోపాటు అదీ అడవికెళ్ళేది. గడ్డిమేస్తూ, గొర్రెపాలు త్రాగేది. గొర్రెలాగానే అరిచేది. అలా అన్నివిధాలా సింహపిల్ల గొర్రెలా పెరిగింది.

ఒకనాడు నదివొడ్డున గడ్డిమేస్తున్న గోపాలుడి గొర్రెల మందపై ఓ సింహం లంఘించింది. గోపాలుడు అప్పుడక్కడలేడు. బెదిరిపోయిన గొర్రెలు నలుదిక్కులా పారిపోయాయి. సింహంపిల్లా గొర్రెలా అరుస్తూ పరిగెత్తింది. సింహానికది ఆశ్చర్యమైంది. ఒక సింహంపిల్ల, సింహాన్ని

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

చూసి గొర్రెలా ఎందుకు పారిపోతోందో దానికి అర్థం కాలేదు. సింహంపిల్ల మీద దూకి, తన కాళ్ల మధ్య దాన్ని చిక్కించుకుని పిల్లతో యిలా అంది: 'ఎంత మందమతివి నువ్వు! నాలాగే నువ్వూ ఓ సింహానివి. ఎందుకు గొర్రెలా అరుస్తావు, గడ్డి మేస్తావు?'

కాని సింహంపిల్ల ఆ మాటలు నమ్మలేదు. తాను గొర్రెననే దాని నమ్మకం. కాబట్టి గొర్రెలా అరవసాగింది. కాని సింహం దాన్ని వదలదలచుకోలేదు. దాన్ని మెడ పట్టుకుని నదిగట్టుకు తీసుకెళ్ళింది. 'చూసుకో నీళ్ళలో నీ ప్రతిబింబాన్ని. నీ రూపూ, నా రూపూ ఒకేలా కనబడటం లేదా?' అందా సింహం. భయభయంగా ఆ సింహంపిల్ల నీళ్ళలో రెండు ప్రతిబింబాలకేసి చూసింది. తన ప్రతిబింబం అచ్చం సింహం ప్రతిబింబంలా, పరిమాణంలో చిన్నదైనా వుండటం దాన్ని ఆశ్చర్యపరిచింది. సింహం వంక అబ్బురంగా చూసింది.

సింహం గర్జిస్తూ 'నువ్వు నాలాగే గర్జించు' అంది. సింహంపిల్ల మొదట గొర్రెలా అరిచింది. కాని మళ్ళీ ప్రయత్నించాక దాని నిజ కంఠస్వరం వచ్చింది. సింహంలా అదీ గర్జించసాగింది. అది గర్జిస్తూ ఆనందించసాగింది. కాస్త ప్రయత్నంమీద అదీ సింహంతో జతకలిపి గర్జించసాగింది.

సింహంపిల్లకు పూర్తిగా అవగాహన చెయ్యాలనుకుందా సింహం. పక్కన మేస్తూన్న ఓ జింకను వేటాడింది. సింహంపిల్ల నోట్లో జింకమాంసాన్ని క్రుక్కింది. ఆ పిల్ల అప్పటిదాకా గడ్డినే మేస్తూ వచ్చింది. కాని యీ తాజా మాంసం, బాగా రుచిగావుంది. ఆ మాంసాన్ని తృప్తిగా తిన్నది. తరవాత సింహం పురమాయింపు లేకుండానే, గొప్పగా గర్జించింది. చివరికి సింహం, పిల్లా అడవిమధ్యలో కెళ్ళిపోయాయి.

మనమందరం సింహంపిల్లలా నిజప్రవృత్తిని మరచిపోయిన వాళ్ళం. ప్రతి ఒక్కరం దేవతాగ్నిలోని కీలల్లాంటి వాళ్ళం. కాని యీ నిజాన్ని మనం అర్థంచేసుకోలేం. ఓ మహాత్ముడు మన నిజప్రవృత్తిని తెలిపి, ఋజువు చేసినప్పుడే మనం మన బలహీనతను వదలుకొని దైవత్వాన్ని పొందగలం. మనం కేవలం గొర్రెలా వుండకూడదు. రోజు రోజుకీ మనం సింహ ప్రవృత్తితో పెరగాలి.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

అందరిలో దేవుడున్నాడు

ఆ ఉదయం బాగా ఎండగావుంది. హిమాలయాల్లో ఎంత చల్లగా వుంటుందో మీకు తెలుసు. అతి ఎత్తులోవున్న కైలాస పర్వతంమీద మరింత చల్లగా వుంటుంది. కాబట్టి సూర్యరశ్మి అక్కడెంతో సంతోషానికి కారణహేతువు. శివ పార్వతుల ముద్దుల తనయుడు వినాయకుడు కాస్త చిరాకుగా వున్నాడు. ఆడుకోవడానికి ఎవ్వరూలేరు తోటలో పరిగెత్తి కెళ్ళి, సూర్యకాంతిలో ఆడుకోవాలనుకున్నాడు.

అతడు వంటశాలలో కెళ్ళాడు. పార్వతీదేవి వంట పనిలో పూర్తిగా నిమగ్నమై వుంది. వినాయకుడు తల్లిని పట్టుకుని "అమ్మా, తోటలో కెళ్ళి ఆడుకోనా?" అని అడిగాడు. "అలాగే నాయనా! బట్టలు పాడుచేసుకోవద్దు. త్వరగా వచ్చెయ్, పాఠాలు చదువుకోవాలి" అంది పార్వతి.

ఆమె మాటలు పూర్తికాకుండానే, వినాయకుడు వెళ్ళిపోయాడు. నాలుగంగల్లో తోటలోవున్నాడు తాజాపువ్వులను కోసి, వాసనలు చూశాడు. పంచరంగుల సీతాకోక చిలుకలను వెన్నంటాడు. జింకలను పట్టుకోవాలని ప్రయత్నించాడు; కాని అవి అతడి కందకుండా పారిపోయాయి. పరిగెత్తి అలసిపోయాడు ఓ చెట్టుక్రింద కూలబడ్డాడు అప్పుడు అతడి పెంపుడుపిల్లి 'మ్యావ్'మంటూ వచ్చింది ప్రేమగా దానికేసి చూశాడు. సొగసుగా నడుస్తూవచ్చి, అతడి ఒళ్ళో కూర్చుంది. కళ్ళుమూసుకుని, నిద్రకు ఉపక్రమించింది

ఇది సబబు కాదనుకున్నాడు గణేశుడు. పగటిపూట నిద్రించటం మంచిదికాదు. తను దాన్ని అలాగే వదిలిపెట్ట కూడదని పిల్లిని నిద్రలేపాడు. కాస్త కళ్ళుతెరిచి, నీరసనగా మ్యావ్‌మంది. వెనకాళ్ళమీద గణేశుడు దాన్ని నిలబెట్టాడు. దానికో పాఠం నేర్పదలుచుకున్నాడు; చేతిలో బెత్తం పుచ్చుకుని తను అనే మాటలను తిరిగి ఒప్పచెప్పమన్నాడు. కాని పిల్లి తెల్లమొహం వేసింది మళ్ళీ గణేశుడి ఒళ్లోచేరి, కళ్లు మూసుకుంది.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

వినాయకుడు చిరాకుపడ్డాడు. తన శిష్యుడు అపధియు దొతున్నాడు. దాన్ని పట్టుకుని, మొహం సాగదీశాడు. అతడి పట్టులోంచి జారుకుని, పిల్లి పారిపోయింది గణేశుడు తనలోనే నవ్వుకున్నాడు. పిల్లులు పిల్లులే గదా! కాస్సేపు తోటలో పచార్లు చేశాక, యింటిముఖం పట్టాడు.

అతడికి ఆకలి దహిస్తోంది. వంటశాలలో కడుగు పెట్టాడు. "అమ్మా, వంట తయారయిందా?" అంటూ కేక పెట్టాడు. చిరునవ్వుతో అతణ్ణి చూసి పార్వతి "అయింది నాయనా, చేతులు కడుక్కొనిరా. ఈలోపు నా గాయాలను శుభ్రం చేసుకుంటాను" అంది. గణేశుడికి ఆశ్చర్యమైంది గాయాలా? తల్లి వంక తదేకంగా చూశాడు అదిరిపడ్డాడు. ఆమె సొగసైన మోము అనేకచోట్ల గీరుకుపోయింది అతడికి కోపం వచ్చింది. "అమ్మ, నిన్నెవరిలా చేశారు? నాన్నకు చెప్పి, ఆ దుష్టుణ్ణి శిక్షిస్తాను."

రెండోసారి అదిరిపడ్డాడు గణేశుడు. "ఇది చేసింది మరెవరో కాదు, నా ముద్దులకొడుకు గణేశుడే" అంది పార్వతి. ఆమె అన్నదాంట్లో తలా తోకా అతడికి అర్థం కాలేదు. "నా తల్లిని గాయపరిచాను! కలలో కూడా అసంభవం. ఇంతసేపూ తోటలోకదా నేనున్నది? బహుశా ఎవరో అల్లరివెధవ నా రూపంలో ఈ దుష్టకార్యం చేసివుంటాడు."

కాని పార్వతి తల అడ్డంగా వూపింది "నాయనా, తోటలో ఆడుకునేటప్పుడు నువ్వు ఎవరినన్నా గాయపరిచావా?" అని అడిగింది. "లేదమ్మా. ఇవాళ నా కెవరూ తోడులేరు" అన్నాడు గణేశుడు. "అయితే, నీ పెంపుడు జంతువులతో ఆడుకుని వాటినేమన్నా బాధించావా?" అడిగింది పార్వతి.

అప్పుడు గణేశుడికి తను పిల్లిని బాధించిన సంగతి గుర్తుకొచ్చింది కాని దానికీ, తల్లి మొహంమీది యీ గాయాలకూ సంబంధ మేమిటి? ఆమెనే అడిగాడు.

పార్వతి నవ్వి ఇలా అంది: "నాయనా! ఈ సమస్త ప్రపంచానికి నేనే తల్లినని నీకు తెలియదా? అన్ని ప్రాణుల్లోనూ జీవించేది నేనే. కాబట్టి ఏ ప్రాణినైనా గాయపరిస్తే, అది నన్నే గాయపరచినట్లవుతుంది."

అప్పటికి తన తప్పు అర్థమైంది తానూ దివ్యజనని పిల్లలలో ఒకడు. పిల్లలందరినీ ఆమె సమంగా ప్రేమిస్తుంది, అందరి బాధ తనూ సమంగా అనుభవిస్తుంది. తల్లి ముందు తల వొంచేస్తూ, గణేశుడు "అమ్మా, నేటి నుండీ ఏ ప్రాణినీ, మనస్సుతోగాని, చేతలతోగాని బాధించను" అన్నాడు.

గణేశుడు వాగ్దానం చేసినట్లుగా మనమూ ఆచరించాలి. అలాంటప్పుడే మనం దివ్యజనని పిల్లల మవుతాం.



Sri Vidyabharathi Book Centre, Srinagar

బావిలోని కప్ప

CC-O. In Public Domain. Digitized by eGangotri

ఒక గ్రామం బావిలో ఓ కప్ప వుండేది. జీవితంలో దానికి తెలిసింది బావి లోపలి భాగం మాత్రమే గ్రామస్థులు నీటికోసం బావిలోవేసే కుండలను మాత్రమే అది చూసింది. కాబట్టి ఆ కప్పకు ఆ బావే సమస్త ప్రపంచం.

ఒకమారు కుండపోతగా వర్షం కురిసింది. ఆ భారీ వర్షం కొన్ని రోజులదాకా కొనసాగింది. మరెక్కడినుండో యింకో కప్ప వచ్చి ఆ బావిలో పడ్డది. ఇంతకుముందు అది సముద్రంలో .జీవించేది. వానల కారణంగా సముద్రంనుండి జారుకొని అది యీ బావి నాశ్రయించింది.

బావికప్ప క్రొత్తగా వచ్చిన కప్పతో, "ఏమోయ్, నువ్వెక్కణ్ణుండి వచ్చావు? నిన్నింతకు ముందు చూసినట్లు లేదే" అంది. దానికి క్రొత్త కప్ప యిలా అంది: "నేను సముద్రంనుండి వచ్చాను. ఈ భారీ వర్షాలు అక్కడ విపరీతమైన చలిని కల్పించాయి. కాబట్టి యిక్కడి కొచ్చాను. ఈ వానలు తగ్గేదాకా యిక్కడ వుండవచ్చా?" "దానికేం భాగ్యం. నీ యిష్టం వచ్చినంతకాలం యిక్కడుండు. మాట్లాడేందుకు నా కెవ్వరూ లేరు కూడా" అంది బావికప్ప.

తను దాచుకున్న ఆహారంనుండి కొంత భాగం ఆ సముద్రకప్పకు పంచి యిచ్చింది.

భోజనానంతరం బావికప్ప "నువ్వు సముద్రం గురించి అన్నావు. నువ్వెక్కడుంటున్నావు. సముద్రమంటే ఏమిటి?" అని అడిగింది. "ఓ! సముద్రమంటే గొప్ప జలమయమైన ప్రాంతం" అందా సముద్రకప్ప. బావికప్ప తన వెనక కాళ్ళను బారజాపి చూపిస్తూ "సముద్రం యింత వెడల్పు వుంటుందా?" అని అడిగింది. దానికి సముద్రకప్ప నవ్వి "సముద్రం చాలా పెద్దది, నీ కాళ్ళమధ్య ఎడంకంటే ఎన్నోరెట్లు పెద్దది" అంది.

బావికప్ప, సముద్రకప్పను కాస్త అనుమానంతో చూసింది. తన ముందుకాళ్ళను బారజాపి, చూపిస్తూ "సముద్రం యింత వెడల్పు వుంటుందా?" అని అడిగింది. మళ్ళీ సముద్రకప్ప నవ్వుతూ "చాలా, చాలా పెద్దది" అంది. బావికప్ప అహం దెబ్బతింది. బావికప్ప బావిలో యిటునుండి అటుకేసి గెంతి "మీ సముద్రం యింత పెద్దగా వుంటుందా?" అని అడిగింది. అందుకు సముద్ర కప్ప "నేను సముద్రం ఎంత పెద్దదో నీకు వివరించలేను. ఈ బావిలో దేనితోనూ సముద్రాన్ని పోల్చలేం."

తోడులేరు" అన్నాడు గణేశుడు." అయితే, నీ పెంపుడు జంతువులతో ఆడుకుని వాటినేమన్నా బాధించావా?" అడిగింది పార్వతి.

అప్పుడు గణేశుడికి తను పిల్లిని బాధించిన సంగతి గుర్తుకొచ్చింది కాని దానికీ, తల్లి మొహంమీది యీ గాయాలకూ సంబంధ మేమిటి? ఆమెనే అడిగాడు.

పార్వతి నవ్వి ఇలా అంది: "నాయనా! ఈ సమస్త ప్రపంచానికి నేనే తల్లినని నీకు తెలియదా? అన్ని ప్రాణుల్లోనూ జీవించేది నేనే. కాబట్టి ఏ ప్రాణినైనా గాయపరిస్తే, అది నన్నే గాయపరచినట్లవుతుంది."

అప్పటికి తన తప్పు అర్థమైంది తానూ దివ్యజనని పిల్లలలో ఒకడు. పిల్ల లందరినీ ఆమె సమంగా ప్రేమిస్తుంది. అందరి బాధ తనూ సమంగా అనుభవిస్తుంది తల్లి ముందు తల వొంచేస్తూ, గణేశుడు "అమ్మా, నేటి నుండీ ఏ ప్రాణినీ, మనస్సుతోగాని, చేతలతోగాని బాధించను" అన్నాడు.

గణేశుడు వాగ్దానం చేసినట్లుగా మనమూ ఆచరించాలి. అలాంటప్పుడే మనం దివ్యజనని పిల్లల మవుతాం.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

ISBN 81-7120-219-9



Rs. 15.00

Sri Vidyabharati ... Centre, Sringeri